



ఎలాగైతేనేం సుందరమ్మగారి కోరిక తీర్చగలిగానన్న తృప్తితో, బస్టాం డుకు చేరుకుని విజయవాడ క్యాంపుకి బయలుదేరాను. ఈ పాటికి ఫార్మాలిటీస్ పూర్తయి, జాయినయి పోయి ఉంటారు.

నెల క్రితం—

బాగా సుస్తీ చేసేసరికి ఆవిడమీద ఆవిడకే నమ్మకం పోయింది. అధైర్యంతో బెంబేలెత్తిపోయారు. అయినా ఏకాకిగా ఎంతకాలం ఉండగలరు? ఆవిడగురించి పూర్తి వివరాలు నాకు తెలీవు. నేను ప్రస్తుత ముంటున్న ఇంట్లోకి వచ్చేసరికి మేడమెట్ల కింద కట్టిన గదిలో ఉందామె. ఇంటాయన అద్దె ఏమీ తీసుకోవడం లేదని చెప్పిన గుర్తు. అయినా, అద్దెగా అయితే వంద మించి ఎవరు ఇవ్వరు. దానికన్నా ఎక్కువగానే ఇంటెడుచాకీరీ ఆవిడ చేస్తోంది. నేను వాటాలోకి చేరిన రోజే ఆవిడంతట ఆవిడే పరిచయం చేసుకుని—

'నీక్కూడా ఏమైనా సహాయం కావలిస్తే చెప్పు బాబూ!'' అంది క్యాంపుల ఉద్యోగం. అందులోను మరోవుద్యోగ ప్రయత్నంలో కూడా ఉన్నాను. మంచినీళ్ళకి, పాలకి ఆవిడ మీద ఆధారపడొచ్చు.

"తప్పకుండా'' అన్నాను.

"పెళ్ళి.. '' మరీ ఒక్కడే కనిపించేసరికి అమాంతం అనుమానం వచ్చి అడిగింది.

"అయిందండీ.. మరో ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాను. ఒకటి రెండు నెలల్లో రావొచ్చు. అందాకా పుట్టింట్లో ఉంచాను'' అన్నాను.

"అలాగా నాయనా.. నువ్వు స్థిరపడేంత వరకూ అక్కడే ఉంచడం మంచిది... సిద్ధి వినాయకుడుకి ముడుపు కడ్తాను'' దయ్‌మంటూ రెండు నెలలు తిరిగే సరికి చక్కగా కాలుమీద కాలువేసుకుని చేసే ఉద్యోగం వస్తుంది...''అందావిడ.

సుందరమ్మ గారి మాటల్లో రక్తసంబంధీకుల ఆత్మీయత కనిపించింది. ఆవిడకే కనుక శక్తి ఉంటే నన్ను నిముషాల మీద క్యాంపుల ఉద్యోగం మాన్పించి వేరే ఉద్యోగం చేయించేది.

మొదటి రోజు ఆవిడతోపాటు మెట్ల కింద ఉన్న గదిలోనే భోంచేశాను. చాలా చిన్న గదది. బట్టల మూటలు. అల్యూమినియం గిన్నెలు. పాతసీసాలు ఉన్నాయి.

మానవసంచారం లేని ద్వీపకల్పం దారి తప్పిన బాటసారిలా అనిపించింది.

ముందు వెనకాఎవరూ లేరా?

అదే అడిగాను.

"లెక్కకి ఉన్నట్లే... లెక్కల్లోకిరారు...'' విచారంగా అయిపోయింది. అప్పటిదాకా లొడలొడ మాట్లాడేస్తున్నావిడ, ఎవరో ఆజ్ఞాపించినట్లు నిశ్శబ్దంగా అయిపోయింది. కాసేపటికి కోలుకొని

నావలో తానుండి ననునట్టేట నడిపే రామచరణం..'' అంటూ పాడుకుంది.

కీర్తనలు, పాటలు చాలా తెలుసావిడకి.

పళ్ళూడిపోయినా మాధుర్యం పోలేదు. గుండె గొంతుక లోంచి వచ్చేపాట అమృతం చిలికిస్తుంది.

రెండు నెలల్లో వస్తుందనుకున్న ఉద్యోగం ఇంకా ఆలస్యం అయ్యేటట్టు ఉంది. ఈలోపు క్యాంపులు తప్పవుగా— మధ్యలో నేను ఇక్కడ ఉన్నప్పుడే ఆవిడకి సుస్తీచేస్తే సపర్యలు చేశాను. కాస్త కోలుకున్నా మానసిక స్థయిర్యం కోల్పోయారు.

ఈరోజు ఉదయాన్నే సాయంత్రం వెళ్ళవలసిన క్యాంపుకి సంబంధించిన ఫైళ్ళు తిరిగేస్తుండగా—

సుందరమ్మగారు వచ్చారు.

"చెప్పండి..'' గుమ్మంలో ఆవిడ వైపు చూస్తూ అడిగాను.

"అది ...'' ఇబ్బందిగా చూసింది నావైపు. ఆ చూపుకి అర్థం తెలుసునాకు. ఇంతకుముందు ఒకటి రెండు సార్లు అవసరమైతే పదో, ఇరవైయో యిచ్చాను.

యిచ్చాను.

"అది..." సిగ్గుతో కుంచించుకుపోతున్నట్టయి పోయారు. "ఇంకా.... కొత్తవాడిలా చూస్తున్నారు..." ఆవిడ అడగకుండానే జేబులోంచి ఓ యాభై రూపాయల నోటు తియ్యబోతుంటే—

"...ఆఁ.... డబ్బులు వద్దు... వద్దు..." తడబడ్డారు.

"మరి?"

ఉన్నదాంట్లో ఉన్నంత ఇవ్వడం తప్ప నేను చేయగలిగినదేముంది?

"దిల్‌సుఖ్‌నగర్‌లో..." నావైపు చూడకుండా గోడలవైపు చూస్తున్నట్టుగా చెప్తోంది.

"ఏదో ఆశ్రమం ఉందిట... ముసలివాళ్ళని చూస్తారుట... అక్కడికి తీసుకువెళ్తావా?.... ఎంత కాలం ఉంటానో తెలీదు... సుస్తీ వచ్చినప్పటి నుండి ఇంటాయన గొడవచేస్తున్నాడు... అవకూడనిది ఏదన్నా అయితే నెత్తిమీదకి వస్తుందంటున్నాడు... అంచేత ఏమీ అనుకోకపోతే..."

క్షణం నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఆవిడవైపు నేనూ చూడలేకపోయాను.

"సరేనండి... కాకపోతే విజయవాడ క్యాంప్‌కి వెళ్ళి వచ్చాకా..." నా మాట పూర్తి కాకుండానె

"ఎప్పుడొస్తావ్?"

"వారంలో..."

"అమ్మో వారమే... వయసు మీద పడిన వాళ్ళకి పౌర్ణమికి, అమావాస్యకి గండం ఉంటుందంటారు. రెండు రోజుల్లో అమావాస్య... ఈ లోపు..." బేలగా అయిపోయి, కన్నీరు పెట్టుకుంది.

ఆవిడకి ధైర్యం చెప్పే శక్తీ లేదు. అనుభవం చాలదు.

"సరేనండి... వెంటనే కనుక్కొంటాను..." అన్నాను.

"ఇదిగో ఎడ్రస్..." అంటూ ఓ కాగితంమ్మీద రాసిన ఎడ్రస్ అందించారు. రెండురోజులక్రితమే ఎవరో ఇచ్చారట ఆవిడకి ఎడ్రస్.

సాయంత్రం నాలుగు గంటలకి బస్సు.

ఈలోపు ఆవిడని చేర్చాలి.

"నా విన్నపమనుకో, కోరికనుకో ఈ ఒక్క సహాయం చెయ్యి..." చేతులు జోడిస్తూ అన్నారు.

"రెండూ కావు... ఆజ్ఞగా భావిస్తాను..." అన్నాను. ఎడ్రస్‌లో టెలిఫోన్ నెంబర్ కూడా ఇచ్చారు. ఫైలు మూసేసి, నెంబర్ తీసుకుని బైటకి కదిలాను. నెంబర్ దొరికింది. క్లుప్తంగా విషయం చెప్పాను. తీసుకురమ్మన్నారు.

మధ్యాహ్నం చివరిసారిగా సుందరమ్మగారి వంట రుచి చూశాను. అప్పటికే సామాన్లు సర్దుకొని ఉన్నారు.

మెట్ల క్రింద గది ఖాళీ చేస్తున్నట్టు ఇంటాయనకి చెప్పడానికి వెళ్తే—

"సామాన్లతో సహా వెళ్ళడం ఎందుకూ?.... తరువాత తీసుకువెళ్ళొచ్చు..." అన్నాడు.

కాస్తలో కాస్త నయం. క్యాంప్‌కి వెళ్ళే హడావుడిలో ఉన్నాను. సామాన్లతోసహా వెళ్ళాలంటే ఇబ్బందే. అందులోను మధ్యాహ్నం రెండు ఆటోలు దొరకడం కష్టం.

"అవునండీ.... ముందు అక్కడ పరిస్థితులు చూశాక తీసుకువెళ్ళొచ్చు..." అన్న నామాట కాదనలేక రెండు మూటలు అక్కడే వొదిలేసి, ఓ చేతి సంచీతో కదిలింది.

ఆశ్రమం దగ్గరకి చేరుకొనేసరికి—

మూడు గంటలయ్యింది.

ఇన్‌ఛార్జ్ ఎక్కడికి వెళ్ళాడో తెలీదుట. వెయిట్ చేయమన్నారు. అరగంట గడిచింది. నాలుగు గంటల బస్సు అందుకోవాలి.

"సుందరమ్మగారు... నా క్యాంపుకి టైం అవుతోంది..." ఇబ్బందిగా చూశాను.

"ఫర్వాలేదు బాబు..... ఇక్కడి వరకు దిగబెట్టావ్... నేను కోరింది ఈ ఉపకారమే..." అందావిడ కృతజ్ఞతగా చేతులు జోడిస్తూ.

"ఛ!.... మీరు దండాలు పెట్టకూడదండి... వస్తా..." పూడుకుపోయిన గొంతులోంచి అతి కష్టమ్మీద రెండు మాటలు అని బైటకి కదిలాను.

అతితక్కువ కాలం పరిచయమయినా అత్యంత సన్నిహితంగా వచ్చిందావిడ!!!

★ ★ ★

క్యాంప్ నుండి వచ్చి యధాలాపంగా మెట్ల క్రింద గది వైపు చూసిన నాకు—

గదిలో సుందరమ్మగారు కన్పించారు.

అటుగా వెళ్ళి—

"మీరు..." ప్రశ్నార్థకంగా చూశాను.

"సామాన్ల కోసం వచ్చారా..." ఏదో గుర్తుకు వచ్చినట్టు అడిగాను.

"కాదు... వాళ్ళు నన్ను జాయిన్ చేసుకోలేదు."

"ఏం?"

"ఆఁ... ఆ ఆశ్రమంలో జాయినవ్వడానికి అర్హత ఉండాలిట..."

"అర్హతా...."

"అవును... నువ్వు వెళ్ళాకా ఇన్‌ఛార్జ్‌గారు వచ్చారు... మీకు పిల్లలున్నారా? అని అడిగారు... ఉన్నారని చెప్పాను... ఎంతమందంటే ఆరుగురన్నాను... మగ పిల్లలెంతమంది అని అడిగాడు. అంతా అని చెప్పాను... అంతే చిత్రంగా నవ్వి పిల్లలులేని అనాధలకి కానీ పిల్లలున్న వాళ్ళకి కాదు ఈ ఆశ్రమం అన్నాడు... బ్రతిమాలాను... రూల్సు ఏవో చెప్పాడు.." అంతదాకా సంబాళించుకున్నావిడ గొల్లుమంది

"కోడళ్ళు వచ్చాకా కొడుకుల దగ్గరఉండే అర్హత పోయింది. కొడుకులున్నందువల్ల ఆశ్రమంలో ఉండే అర్హత పోయింది... ప్చ్..." అంది.

"మీకు ఆరుగురు కొడుకులా?...." అప్పుడే తెలిసిన విషయం వల్ల ఆశ్చర్యంగా అడిగాను.

"అవును..."

"మరి..."

"అదక్కు.... ఐదుగురు ఈ ఊళ్ళో లేరు... ఉన్న ఒక్కడు నన్ను పట్టించుకోడు..."

"ఎక్కడుంటాడండి ఆ మహానుభావుడు..."

"మీ ఇంటి యజమానే...!"

●

'నీకు ముక్కుమీద కోపం ఉందటగా?'

'పచ్చి అబద్ధం. మరోసారి అలా మాట్లాడితే తంతానంతే...!' అన్నాడు మురళీ కోపంగా.

'రాముడిని పట్టుకుని రాక్షసుడు అంటావేంరా?' అడిగాడు వంశీ.

'కాకపోతే మరేమిటి. బొమ్మలు గట్రా విరక్కొడ్తే అది చెడ్డపని. మరి చెడ్డపనులన్నీ రాక్షసులే చేస్తారుకదా. రాముడేమో శివధనస్సుని విరక్కొట్టి రాక్షసుడయ్యాడు!' చెప్పాడు మురళి

పి. సురేశ్‌కుమార్, హైదరాబాద్



'నువ్విక్కడికి ఎందుకు వచ్చావు?'

'పోటీ'

'ఎందులో పోటీ'

'గవర్నమెంట్ వారు ముద్రిస్తున్న రూపాయి నోట్లు నేను ముద్రిస్తున్నానని ఓర్వలేక ఇలా జైలులో పెట్టారు.

